టీచర్లు ఉండరు.. చదువు సాగదు



లక్ష్మీపూర్‌లో ఏకోపాధ్యాయ పాఠశాల

- పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరత
- 38 మంది ఎస్జీటీ 4 ఎస్‌ఏ పోస్టులు ఖాళీ
- అందని ద్రాక్షగా ప్రాథమిక విద్య

దామరగిద్ద: మండలంలో ఉపాధ్యాయుల కొరతతో ప్రాథమిక విద్య అందని ద్రాక్షగా మారింది. పేద విద్యార్థుల పాలిట శాపంగా మారింది. ప్రభుత్వ పాఠశాలల్లో వసతుల కొరత ఉన్న అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులు ఉంటారనే నమ్మకంతో పేద మధ్య తరగతి విద్యార్థులు ప్రభుత్వ బడుల్లో చదువుకుంటున్నారు. తల్లిదండ్రులు కూడా తమ పిల్లల భవిష్యత్‌ను తీర్చిదిద్దే ఉపాధ్యాయులు ఉన్నారన్న నమ్మకంతో గతేదాది కంటే ఈ ఏడాది అధికంగా ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించారు. మండలంలోని మొత్తం 29 ప్రాథమిక, 11 ప్రాథమికోన్నత, 6 జెడ్పీ ఉన్నత, కేజీబీవీ, టీఎస్‌డబ్ల్యూయూఆర్‌ఎస్ పాఠశాలలు ఉన్నాయి. వీటి పరిధిలో 6198 విద్యార్థులు చదువుకుంటున్నారు. కాగా మండలంలోని గ్రామాల్లో బదిలీల సమయంలోనూ ఉపాధ్యాయ ఖాళీలు భర్తీ కాకపోవడం, గత ఆగస్టులో జరిగిన పదోన్నతుల్లో మరో నలుగురు ఉపాధ్యాయులు స్థాన చలనంతో ఎస్‌జీటీ ఉపాధ్యాయ ఖాళీల సంఖ్య 38కి పెరిగింది. వీటితో పాటు 4 ఎస్‌ఏ పోస్టులు ఖాళీగా ఉన్నాయి.

11 ఏకోపాధ్యాయ పాఠశాలలు

మండలంలోని 29 ప్రాథమిక పాఠశాలల్లో 11 పాఠశాలలు ఏకోపాధ్యాయ పాఠశాలలు ఉండడంతో విద్యార్థులు నాణ్యమైన విద్య అందడం లేదు. యల్సన్‌పల్లి, చాకలోన్‌పల్లి, లక్ష్మీపూర్, అయ్యవారిపల్లి, వత్తుగుండ్ల తండా, లింగారెడ్డిపల్లి, క్యాతన్‌పల్లి, దామరగిద్ద, మల్‌రెడ్డిపల్లి ఉర్దూమీడియం, సుద్దబండతండ ప్రాథమిక పాఠశాలల్లో ఏకోపాధ్యాయులతో బోధన కొనసాగుతుంది. మండంలోని ఉల్లిగుండం ప్రాథమికోన్నత పాఠశాలలో 110 మంది విద్యార్థులకు గాను ఇద్దరు రెగ్యులర్ ఉపాధ్యాయులు పనిచేస్తున్నారు. కాగా స్థానిక నాయకుల చొరవతో మరో ఇద్దరు వాలంటీర్లు, ఎంఈఓ చొరవతో మరో ప్రభుత్వ ఉపాధ్యాయుడు డిప్యూటేషన్‌పై విధులు నిర్వహిస్తున్నారు. సర్జాపూర్ యూపీఎస్ లోను ఏడు తరగతుల్లో 78 మంది విద్యార్థులకు గాను ఇద్దరు రెగ్యులర్ ఉపాధ్యాయులు ఉండగా ఇటీవల 2008 డీఎస్సీ అభ్యర్థుల్లో కాంట్రాక్ట్ పై మరో ఉపాధ్యాయుడు విధుల్లో చేరగా ముగ్గురు ఉపాధ్యాయులతో ఏడు తరగతులు కొనసాగుతున్నాయి. గతంలో ఉన్న వాలంటీర్ల వ్యవస్థను కూడ ప్రభుత్వం కొనసాగించకపోవడంతో మండలంలోని అనేక బడుల్లో ప్రాథమిక విద్యా బాలారిష్టాల్లో మగ్గుతుంది.

ఐదు తరగతులకు ఒకే టీచర్

మా ఊరిలో ఉన్న పాఠశాలలో ఐదు వరకు తరగతులు కొనసాగుతున్నాయి. అయితే పాఠశాలలో అన్ని తరగతులకు ఒకే ఉపాధ్యాయుడు ఉన్నారు. దీంతో చాలా మంది విద్యార్థులు ప్రైవేట్ బడికి వెళుతున్నారు. మాలాంటి పేద విద్యార్థులు ఇక్కడే చదువుకుంటున్నాం.

–నిజనంద, 5వ తరగతి, యల్సన్‌పల్లి

ప్రైవేట్ బడులకు పంపిస్తున్నారు

ప్రభుత్వ పాఠశాలలో సరిపడా ఉపాధ్యాయులు లేకపోవడంతో అనేక మంది తమ పిల్లలను ప్రైవేట్ బడులకు పంపిస్తున్నారు. గతంలో రెగ్యులర్ టీచర్‌తో పాటు వాలంటీర్లను నియమించి పాఠశాలను కొనసాగించే వారు. ప్రస్తుతం బడుల్లో టీచర్లు లేకపోవడంతో తల్లిదండ్రులు ఖర్చులు భరిస్తూనే ప్రైవేట్ పాఠశాలలకు పంపిస్తున్నారు.

–బస్వరాజ్, యల్సన్‌పల్లి

సర్దుబాటు చేస్తున్నాం

మండలంలోని ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరత ఉన్న మాట వాస్తవమే. ఆయా పాఠశాలల్లో అవసరాన్ని బట్టి ఉపాధ్యాయులను సర్దుబాటు చేస్తున్నాం. 20 మంది పార్ట్‌టైం టీచర్ల అవసరముందని జిల్లా విద్యాధికారికి నివేదించాం.

–కృష్ణారెడ్డి, ఎంఈఓ, దామరగిద్ద

బీసీ రిజర్వేషన్లు అమలు చేయాల్సిందే



సమావేశంలో అభివాదం చేస్తున్న నాయకులు



మాట్లాడుతున్న రాష్ట్ర నాయకుడు నారాయణ

నారాయణపేట/నారాయణపేట టౌన్: స్థానిక సంస్థల ఎన్నికలలో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని కోరుతూ రాజ్యసభ సభ్యులు, బీసీ నాయకుడు ఆర్ కృష్ణయ్య పిలుపుమేరకు శనివారం నిర్వహించనున్న రాష్ట్ర బంద్‌కు జిల్లాలోని విద్యా, వ్యాపార, వాణిజ్య సంస్థలు స్వచ్ఛందంగా సహకరించాలని బీసీ సంఘాల నాయకులు పిలుపునిచ్చారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని అంబేడ్కర్ భవన్‌లో బీసీ జాగృతి సేన రాష్ట్ర ఉపాధ్యక్షుడు వెంకటేష్ యాదవ్, జిల్లా అధ్యక్షుడు ఎద్ల కుర్మయ్య ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ప్రజా సంఘాల నాయకులు మాట్లాడుతూ బీసీ సామాజిక వర్గానికి చెందిన మాజీ ప్రజా ప్రతినిధులు, స్థానిక సంస్థల ఎన్నికలలో పోటీ చేయదలచిన ఆశావాహులు అధిక సంఖ్యలో తరలివచ్చి రిజర్వేషన్ల సాధనకు జరుగుతున్న ఉద్యమానికి సహకరించాలని కోరారు. స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపకురాలు ఈశ్వరమ్మ, బీసీ సంఘాలు నాయకులు చంద్రశేఖర్, మన్నెం, రఘువీర్ యాదవ్, కాశీనాథ్ తదితరులు పాల్గొన్నారు.

42 శాతం రిజర్వేషన్లు వర్తింపజేయాలి

మరికల్: బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు వర్తింపజేయాలని కోరుతూ బీసీ సంఘాల ఆధ్వర్యంలో నేడు చేపట్టిన రాష్ట్ర బంద్‌ను జయప్రదం చేయాలని బీసీ సంఘం రాష్ట్ర నాయకుడు నారాయణ కోరారు. కాంగ్రెస్, బీఆర్‌ఎస్, బీజేపీ, బీసీ సంఘాల ఆధ్వర్యంలో శనివారం చేపట్టిన బంద్‌లో అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు. సమావేశంలో బసంత్, రాజేష్, రవి, వేణు, రమేష్, మల్లయ్య, నరేష్‌గౌడ్, గోవర్ధన్, మల్లేష్, మహేష్, శివ పాల్గొన్నారు.

విజయవంతం చేయాలి

ఊట్కూరు: బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు వర్తింపజేసేలా చర్యలు తీసుకోవాలని పీవైఎల్ జిల్లా ప్రధాన కార్యదర్శి సిద్దు డిమాండ్ చేశారు. శనివారం రాష్ట్ర బంద్ నేపథ్యంలో శుక్రవారం పీవైఎల్ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. స్థానిక ఎన్నికల్లో బీసీ వర్గాలకు 42 శాతం రిజర్వేషన్ బిల్లును గవర్నర్ ఆమోదించకపోవడం శోచనీయమన్నారు. బిల్లును ఆమోదించాలని కోరుతూ చేపట్టిన బంద్‌లో అన్ని బీసీ సంఘాలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో పీవైఎల్ నాయకులు వెంకట్‌రెడ్డి, మల్లేష్, గోవర్ధన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బంద్‌కు మాస్‌లైన్ పార్టీ సంపూర్ణ మద్దతు


నారాయణపేట: బీసీ రిజర్వేషన్లపై బీజేపీ ప్రభుత్వం వైఖరిని నిరసిస్తూ శనివారం చేపట్టిన రాష్ట్ర బంద్‌కు మాస్ లైన్ పార్టీ సంపూర్ణంగా మద్దతు తెలిపిందని సీపీఐ(ఎంఎల్) మాస్ లైన్ పార్టీ జిల్లా కార్యదర్శి బి.రాము పేర్కొన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని భగత్ సింగ్ భవన్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. బీసీ బిల్లును బీజేపీ కావాలనే గవర్నర్ ఆమోదించకుండా అడ్డుకుంటుందని మండిపడ్డారు. బీజేపీకి బీసీల మీద ఏమాత్రం ప్రేమ ఉన్న తక్షణమే అమోదించాలన్నారు. సమావేశంలో ఆ పార్టీ నాయకులు కాశీనాథ్, రాము. జయ. నర్సిములు.నారాయణ. సాయి కుమార్, జి. వెంకట్రాములు. హాజీ మలంగ్, దామోదర్, రఫీ, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

దామరగిద్ద: బీసీలకు 42 రిజర్వేషన్లు అమలు చేయాలని బీసీ ఉద్యమ సంఘాలు శనివారం చేపట్టిన రాష్ట్ర బంద్‌కు పీవైఎల్ సంపూర్ణ మద్దతు తెలుపుతుందని పీవైఎల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పెద్దింటి రామకృష్ణ అన్నారు. బీసీ రిజర్వేషన్లు అమలు చేసే వరకు తాము మద్దతుగా ఉంటామన్నారు.

రాష్ట్ర బంద్‌కు బీజేపీ మద్దతు

కోస్గి: బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ఇస్తామని చెప్పి కోర్టుల పేరుతో కాలయాపన చేయడం ప్రభుత్వానికి తగదని కొడంగల్ నియోజకవర్గ బీజేపీ కో కన్వీనర్ కోటకొండ రాము అన్నారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి తమ రాజకీయ పబ్బం గడుపుకునేందుకు బీసీలను వాడుకొని మోసం చేశారన్నారు. శనివారం నిర్వహించ తలపెట్టిన బంద్‌కు బీజేపీ మద్దతు తెలుపుతుందన్నారు.

బీజేపీ కుట్రతోనే బీసీలకు అన్యాయం



పేటలో నిరసన తెలుపుతున్న సీపీఎం నేతలు

నారాయణపేట: బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని కోరుతూ శుక్రవారం సీపీఎం రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా చలో రాజ్‌భవన్ ముట్టడి కార్యక్రమాన్ని ప్రజాస్వామ్యబద్ధంగా, శాంతియుతంగా నిర్వహిస్తున్న సందర్భంలో నాయకులను అరెస్ట్ చేయడం తగదని సీపీఎం జిల్లా కార్యదర్శి వెంకట్రామరెడ్డి అన్నారు. ఈ మేరకు శుక్రవారం జిల్లా కేంద్రంలోని అంబేడ్కర్ చౌరస్తాలో సీపీఎం పార్టీ ఆధ్వర్యంలో బీజేపీ నిర్లక్ష్య వైఖరి నశించాలని నినాదాలు చేస్తూ నిరసన కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కామ్రేడ్ గోపాల్, నాయకులు బలరాం, ఆంజనేయులు గౌడ్, కాశప్ప, నరహరి, గోవిందు, లాలప్ప, భీమేష్ తదితరులు పాల్గొన్నారు.

రిజర్వేషన్లు సాధించి తీరుతాం

మద్దూరు: బీసీలకు 42 శాతం రిజర్వేషన్లను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం సీపీఎం రాష్ట్ర కమిటీ రాజ్‌భవన్ ముట్టడికి పిలుపు ఇచ్చిన నేపథ్యంలో పోలీసులు మండల సీపీఎం నాయకులు అశోక్, మహమ్మద్ అలీ, హన్మంతు, భరత్‌కుమార్‌ను అరెస్ట్ చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా సీపీఎం నాయకులు మాట్లాడుతూ.. బీజేపీ ప్రభుత్వం రాష్ట్రంలో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేయకుండా అడ్డుపడుతుందని ఆరోపించారు. ఎన్ని అవాంతరాలు వచ్చిన బీసీ రిజర్వేషన్లు సాధించి తీరుతామని ధీమా వ్యక్తం చేశారు. అనంతరం పోలీసులు సొంత పూచీకత్తుపై వారిని విడుదల చేశారు.

సీపీఎం నాయకుల అరెస్ట్

మాగనూర్: బీసీ రిజర్వేషన్లపై బీజేపీ వైఖరికి నిరసనగా చలో రాజ్‌భవన్ బయలుదేరిన సీపీఎం నాయకులను పోలీసులు అరెస్టు చేయడం అన్యాయమని సీపీఎం నాయకులు బాలురాజ్ అన్నారు. రిజర్వేషన్ల కల్పన అధికారం రాష్ట్రాలకే వర్తించేటట్టు కేంద్రం వెంటనే ఆర్డినెన్స్ తీసుకురావాలన్నారు. లేకుండా బీసీలు బీజేపీ ప్రభుత్వానికి తగిన బుద్ధి చెబుతారని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు బాలురాజ్, నరేష్, నర్సింహ ఉన్నారు.


జాతరకు ప్రత్యేక బస్సులు నడపాలి

మరికల్: కురుమూర్తి జాతరకు నారాయణపేట డిపో నుంచి బస్సులు నడపాలని బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి రమేష్ నాయకులు శ్రీరామ్, మహేష్‌లు శుక్రవారం సంయుక్త ప్రకటనలో కోరారు. కురుమూర్తి బ్రహ్మోత్సవాల సందర్భంగా పల్లెల్లోకి వస్తున్న పల్లె వెలుగు బస్సులను వారం రోజుల పాటు యధవిధిగా అదే పల్లెల మీదుగా కురుమూర్తి జాతరకు నడిపించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ఇతర గ్రామాల నుంచి దేవరకద్రకు వెళ్లి అక్కడి నుంచి జాతరకు వెళ్లడం వల్ల రద్దీ అధికంగా ఉండటంతో భక్తుల బంగారు అభరణాలు, నగదు అపహరణకు గురవుతున్నట్లు తెలిపారు. భక్తుల భద్రతను దృష్టిలో పెట్టుకొని జాతరకు బస్సులు నడిపేందుకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

సకాలంలో కరెంట్ బిల్లు చెల్లించాలి

నారాయణపేట: జిల్లా కేంద్రంలోని విద్యుత్ వినియోగదారులు సకాలంలో విద్యుత్ బిల్లులను చెల్లించాలని స్థానిక ఏఈ మహేశ్‌గౌడ్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. నిర్ణీత గడువులో బిల్లును చెల్లించినట్లయితే అపరాధ రుసుం కట్టనవసరం లేదని, నిర్ణయిత గడువు 14 రోజులు అయిన తర్వాత ఎవరైతే బిల్లులు చెల్లిస్తారో వారు రూ.100 అదనపు చార్జీలు చెల్లించాల్సి ఉంటుందన్నారు. కావున విద్యుత్ వినియోగదారులు, అద్దెకు ఉన్న వినియోగదారులు తమ కరెంటు బిల్లును సకాలంలో చెల్లించి విద్యుత్ శాఖ సిబ్బందికి సహకరించాలని కోరారు.

నూతన కమిటీ ఎన్నిక



నారాయణపేట టౌన్: నారాయణపేట జిల్లా మాదాసి కురువ సంఘం నూతన కమిటీని శుక్రవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ మేరకు నారాయణపేట నియోజకవర్గ అధ్యక్షుడు బండి హన్మంతు, మక్తల్ తాలుకా అధ్యక్షుడు అంజప్ప, ప్రధాన కార్యదర్శి సిద్దు, గౌరవ అధ్యక్షుడు వెంకటప్ప, ఉపాధ్యక్షుడు మాలె నర్సింములు ఆధ్వర్యంలో నారాయణపేట జిల్లా కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా వెంకటన్న, ప్రధాన కార్యదర్శిగా తిప్పన్న, ఉపాధ్యక్షుడిగా ఊట్కూర్ ఆశప్ప, కోశాధికారిగా చిత్తనూర్ ఆశప్ప, గౌరవ అధ్యక్షుడుగా యాంకి రాములు ఎన్నికయ్యారు.

తాపీ మేస్త్రీలకు ధ్రువపత్రాల పంపిణీ

ఊట్కూరు: ఊట్కూరులోని మండల పరిషత్ భవనంలో శుక్రవారం న్యాక్ సంస్థ ఆధ్వర్యంలో తాపీ మేస్త్రీలకు ఇన్‌ఛార్జి ఎంపీడీఓ లక్ష్మీ నర్సింహరాజు ధ్రువపత్రాలను అందించారు. నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్స్ సంస్థ ఆధ్వర్యంలో 50 మంది తాపీ మేస్త్రీలకు 15 రోజుల పాటు శిక్షణ ఇచ్చి అనంతరం ధ్రువపత్రాలను అందజేసినట్లు తెలిపారు. శిక్షణ కాలంలో రోజుకు రూ.300 చొప్పున 15 రోజులకుగాను రూ.4500 పారితోషికం కూడా అందించినట్లు పేర్కొన్నారు. గ్రామ కార్యదర్శి శ్రీనివాసరావు, అజమ్మ, నారాయణ, వెంకట్, మేస్త్రీ నాగేష్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

పేదల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం



కల్యాణలక్ష్మి చెక్కులను పంపిణీ చేస్తున్న మంత్రి వాకిటి శ్రీహరి

మాగనూర్: మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో శుక్రవారం మంత్రి వాకిటి శ్రీహరి దాదాపు 45 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ డబ్బులను వృథా చేయకుండా అవసరానికి వినియోగించుకోవాలన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రవేశపెడుతూ దేశానికే మార్గదర్శిగా మారారని కొనియాడారు. పేదల సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం అనేక ప్రజాసంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తుందని స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఆర్డీవో రాంచందర్, ఇంచార్జీ తహసీల్దార్ సురేష్‌కుమార్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఆనంద్‌గౌడ్, ఆర్‌ఐ శ్రీశైలం, కాంగ్రెస్ పార్టీ నాయకులు శివరాంరెడ్డి, రవీందర్, శంకర్, తిప్పయ్య తదితరులు పాల్గొన్నారు.

ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించాలి



ధాన్యం కొనుగోలుదారులకు సూచనలిస్తున్న ఐకేపీ ఏపీఎం కృష్ణవేణి

కోస్గి రూరల్: రైతులు ధాన్యాన్ని ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించాలని డివిజన్ వ్యవసాయాధికారి రామకృష్ణ సూచించారు. శుక్రవారం పట్టణంలోని మండల పరిషత్ కార్యాలయంలో కొనుగోలు కేంద్రాల అధికారులతో సన్నాహక సమావేశం నిర్వహించి పలు సూచనలు చేశారు. రైతులు అవసరమైన గన్నీ బ్యాగ్స్ కొనుగోలు కేంద్రాలలోనే తీసుకోవాలన్నారు. తేమ శాతం 17 లోపు ఉండేలా చూడాలన్నారు. వరి గ్రేడ్–ఏ రకానికి రూ.2369తో పాటు రూ.500 బోనస్ అందజేస్తామన్నారు. కార్యక్రమంలో మండల తహసిల్దార్‌లు శ్రీనివాసులు, వుణుగోపాల్ , పిఏసీఎస్ చైర్మన్ తూం భీంరెడ్డి , ఏఈఓలు, ఏపీఎంలు ఉన్నారు.

ధాన్యం కొనుగోలు చేపట్టాలి

మద్దూరు: రైతులకు ఏలాంటి ఇబ్బందులు లేకుండా ధాన్యం కొనుగోలు చేయాలని కోస్గి ఏడీఏ రామకృష్ణ ధాన్యం కొనుగోలుదారులకు సూచించారు. శుక్రవారం మద్దూరు తహసీల్దార్ కార్యలయంలో ఉమ్మడి మద్దూరు మండలంలో ధాన్యం కొనుగొళ్లపై అన్ని శాఖల అధికారులు, ధాన్యం కొనుగోలు కేంద్రాల ఇన్‌చార్జిలతో సన్నాహక సమావేశం నిర్వహించారు. ధాన్యాన్ని రైతు నేరుగా కొనుగోలు కేంద్రానికి తీసుకొస్తే ఏఈఓ ధాన్యంలో తేమశాతం గుర్తించి గన్నీ బ్యాగులను అందజేసి తూకం వేయనున్నట్లు తెలిపారు. గ్రేడ్–ఏ రకం క్వింటాల్‌కు రూ.2,389, సాధారణ రకానికి రూ.2,369 అందజేయడం జరుగుతుందన్నారు. ప్రభుత్వ నిబంధనల మేరకు రైతులకు ఏలాంటి ఇబ్బందులు లేకుండా ధాన్యం కొనుగోలు జరపాలన్నారు. మద్దూరు, కొత్తపల్లి తహసీల్దార్లు మహేష్‌గౌడ్, జయరాం, ఐకేపీ ఏపీఎం కృష్ణవేణి, పీఏసీఎస్ చైర్మన్ నర్సింహా, ఏఈఓలు పాల్గొన్నారు.

సీపీఆర్‌తో ప్రాణాలు కాపాడవచ్చు



సీపీఆర్‌పై అవగాహన కల్పిస్తున్న 108 సిబ్బంది

నారాయణపేట: గుండెపోటుకు గురైన సమయంలో సీపీఆర్ చేసి మనిషి ప్రాణాలను కాపాడవచ్చని వైద్య సిబ్బంది వివరించారు. ప్రభుత్వం, జాతీయ ఆరోగ్య మిషన్ ఆధ్వర్యంలో సీపీఆర్‌పై జిల్లా కేంద్రంలోని అంబేడ్కర్ చౌరస్తాలో 108 ఆధ్వర్యంలో ప్రజలకు అవగాహన కల్పించారు. సీపీఆర్ అనేది అత్యవసర పరిస్థితుల్లో ప్రాణాలను రక్షించే కీలక ప్రక్రియని, దీనిని సరిగా నిర్వహిస్తే ఫలితం ఉంటుందన్నారు. జిల్లా సూపర్‌వైజర్ రాఘవేంద్ర, 108 అంబులెన్స్ సిబ్బంది, టెక్నీషియన్ అబ్దుల్ అసద్, భీమ్ రెడ్డి, వెంకటేష్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు అవగాహన

ఊట్కూరు: ఊట్కూరులోని బాలుర, బాలికల ఉన్నత పాఠశాలలో శుక్రవారం డాక్టర్ సంతోషి ఆధ్వర్యంలో సీపీఆర్‌పై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఎవరికైనా హఠాత్తుగా గుండెపోటు వచ్చినప్పుడు సీపీఆర్ చేసే పద్ధతిని చూపించారు. సీపీఆర్ ద్వారా గాలిని అందించి వెంటనే ఆస్పత్రికి తరలిస్తే ప్రయోజనం ఉంటుందన్నారు.

సీపీఆర్‌తో ఎంతో ప్రయోజనం

కోస్గి: గుండె, శ్వాస ఆగిపోవడం వంటి సందర్భాలలో సీపీఆర్ చేపట్టడం వల్ల మనిషి ప్రాణాలు కాపాడవచ్చని గుండుమాల్ ఆస్పత్రి వైద్యురాలు కిష్టమ్మ అన్నారు. శుక్రవారం గుండుమాల్ ఆదర్శ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు అవగాహన కల్పించారు. గుండె ఆగిపోయినప్పుడు నిమిషానికి 120 సార్లు ఛాతిపై ఒత్తిడి చేయాలని సూచించారు.

హజ్రత్ ఖతాల్ వలీ సాహెబ్ ఉర్సు

ఆత్మకూర్: పట్టణంలో వెలసిన హజ్రత్ ఖతాల్ వలీ సాహెబ్, హజరత్ అలీ సాహెబ్ రహ్మతుల్లాఅలై ఉర్సు ఉత్సవాలు ఘనంగా ముగిశాయి. శుక్రవారం రాత్రి దర్గాలో వట్టెం షరీఫ్ పీఠాధిపతి ఖాజబాబా సాహెబ్ ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. కార్యక్రమంలో ఇక్బాల్‌బిన్ సయ్యద్, ఖమర్ బిన్‌సయ్యద్ పాల్గొన్నారు.

పిన్నంచర్లలో ముగిసిన ఉర్సు

పిన్నంచర్ల గ్రామంలో హజ్రత్ మహబూబ్‌సుబానీ రహ్మతుల్లాఅలై ఉర్సు ఉత్సవాలు శుక్రవారం రాత్రి ఘనంగా ముగిశాయి. గ్రామంలోని చిన్నదర్గానుండి గంధోత్సవాన్ని మేళ తాళాల మధ్య పెద్ద దర్గాకు చేర్చారు. అనంతరం భక్తులు పెద్దసంఖ్యలో విచ్చేసి ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

బాలల హక్కులను రక్షిద్దాం



ఆత్మకూర్: బాలల హక్కుల రక్షణకు ప్రతిఒక్కరు కృషి చేయాలని సీడీపీఓ లక్ష్మమ్మ అన్నారు. శుక్రవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో మహిళాభివృద్ధి, శిశు సంక్షేమశాఖ, బాలల సంరక్షణ విభాగాల ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీడీపీఓ బాలల హక్కులను ఉద్దేశించి మాట్లడారు. తహసీల్దార్ చాంద్‌పాషా, ఎంపీడీఓ శ్రీపాద్, ఎంపీఓ శ్రీరాంరెడ్డి, ఏపీఎం పారిజాతం, ఎంఈఓ బాలరాజు, మున్సిపల్ మేనేజర్ గణేష్, ఏఎస్‌ఐ రోషయ్య తదితరులు పాల్గొన్నారు.

శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందిద్దాం



కృష్ణ: విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందిద్దామని మండల ఎంఈవో నిజాముద్దీన్ అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని ముడుమాల్ జిల్లా పరిషత్తున్న పాఠశాలలో సైన్స్ ప్రయోగశాలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సైన్స్ కేవలం ఒక సబ్జెక్టులాగా కాకుండా జీవితంలో ఎంతో ఉపయోగపడుతుందన్నారు. విద్యార్థులు సైన్స్‌లో అవగాహన పెంచుకొని నూతన ఆవిష్కరణలకు నాంది పలకాలన్నారు. కార్యక్రమంలో కాంపెక్సు హెచ్‌ఎం గణేష్‌సింగ్, కిషోర్, జనార్దనరెడ్డి, లింగమ్మ, శేఖర్, ఈరన్న, అజయ్, నల్లె శివరాజ్, కుర్మయ్య పాల్గొన్నారు.

సీజేఐపై దాడి హేయమైన చర్య

మాగనూర్: సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిపై దాడి హేయమైన చర్య అని ఎమ్మార్పీఎస్ నాయకులు తెలిపారు.ఈ మేరకు శుక్రవారం తహసీల్దార్ కార్యాలయం ముందు నిరసన కార్యక్రమం చేపట్టారు. అనంతరం ఇన్‌చార్జి తహసీల్దార్ సురేష్‌కుమార్ కు వినతిపత్రం అందజేశారు. సీజేఐ గవాయ్‌పై దాడి చేసిన దుండగుడిని వెంటనే అరెస్టు చేసి, కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. ఎమ్మార్పీఎస్ నాయకులు దినేష్, గోవింద్, దుప్పలి లక్ష్మప్ప, సాయన్న, నాగార్జున, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాల సమయానికి బస్సు నడపాలి

మరికల్: బస్సు సమయపాలన పాటించకపోవడంతో తాము పాఠశాలకు సమయానికి వెళ్లలేకపోతున్నామని పల్లెగడ్డ విద్యార్థులు ఏబీవీపీ ఆధ్వర్యంలో రోడ్డుపై బైటాయించి నిరసన తెలిపారు. నారాయణపేట డిపోకు చెందిన పల్లెవెలుగు బస్సులో రోజూ పల్లెగడ్డ, మాధవరం నుంచి అనేక మంది విద్యార్థులు చదువుకోవడానికి మరికల్ వెళ్తుంటారన్నారు. అయితే బస్సు సమయపాలన పాటించకపోవడంతో తాము సమయానికి పాఠశాలకు చేరుకోలేకపోతున్నామని నిరసన వ్యక్తం చేశారు.

నిందితుడిని శిక్షించాలి

ధన్వాడ: సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిపై దాడికి నిరసనగా శుక్రవారం ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో స్థానిక తహసీల్దార్ కార్యలయం ముందు నిరసన కార్యక్రమం నిర్వహించారు. సీజేఐ గవాయ్‌పై దాడి చేసిన నిందితుడిని కఠినంగా శిక్షించి ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడలని డిమాండ్ చేశారు. అనంతరం తహసీల్దార్ సింధుజాకు వినతిపత్రం అందజేశారు.

అప్రమత్తంగా ఉండాలి

నారాయణపేట: సైబర్ నేరగాళ్లతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఏఎస్‌ఐ ఆంజనేయులు సూచించారు. ఎస్పీ డాక్టర్ వినీత్ ఆదేశాల మేరకు జిల్లా కేంద్రంలో శుక్రవారం ప్రజలకు సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. సైబర్ నేరాలు, దొంగతనాల పట్ల అప్రమత్తంగా ఉండాలని, మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలన్నారు. సైబర్ మోసం లేదా దొంగతనానికి గురైతే వెంటనే డయల్ 100, 1930 సైబర్ హెల్ప్‌లైన్ లేదా సమీప పోలీసులను సంప్రదించాలన్నారు.

క్లుప్తంగా

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక



కోస్గి రూరల్: గుండుమాల్ మండలంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన కీర్తన రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపికైంది. ఈ నెల 14న ఉమ్మడి జిల్లా స్థాయిలో జరిగిన పోటీల్లో అండర్–17 బాలికల విభాగంలో ప్రతిభ కనబరచడంతో రాష్ట్రస్థాయికి సెలెక్ట్ అయినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శేఖర్‌రెడ్డి అన్నారు. విద్యార్థిని ఈ నెల 18 నుంచి 20వ తేదీ వరకు పాలమూరు జిల్లాలోని తిరుమలాపూర్‌లో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొననున్నట్లు పేర్కొన్నారు. ఈ మేరకు విద్యార్థినిని పాఠశాలలో శుక్రవారం అభినందించారు.

ఇళ్లను త్వరగా నిర్మించుకోవాలి

మరికల్: లబ్ధిదారులు ఇందిరమ్మ ఇళ్లను త్వరగా నిర్మించుకోవాలని జిల్లా కాంగ్రెస్ పార్టీ నాయకులు సూర్యమోహన్‌రెడ్డి అన్నారు. ఆయన శుక్రవారం మరికల్‌లో కార్యదర్శి శ్యామ్‌సుందర్‌రెడ్డితో కలిసి ఇళ్ల నిర్మాణం చేపట్టని లబ్ధిదారులను కలిసి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఇళ్లు మంజూరు కాకుంటే నాయకుల, అధికారుల చుట్టూ తిరుగుతారు.. మంజూరు చేస్తే ఎందుకు నిర్మించుకోవడం లేదన్ని ప్రశ్నించారు. ఇళ్లు మంజూరైనా నిర్మించుకోకుంటే రద్దు చేస్తామన్నారు. కార్యక్రమంలో రామకృష్ణారెడ్డి, శ్రీను, గోవర్ధన్, ఆంజనేయులు, రఘు పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణాలను పరిశీలించిన కమిషనర్



నారాయణపేట టౌన్: ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయాలని నారాయణపేట మున్సిపల్ కమిషనర్ నర్సయ్య అన్నారు. జిల్లా కేంద్రంలో మంజూరైనా ఇందిరమ్మ ఇళ్లను శనివారం ఆయన సందర్శించారు. అనంతరం నిర్మాణ పనులు ఎంత మేరకు జరిగాయో, అదే విధంగా ప్రభుత్వం నుంచి అందాల్సిన ఆర్థిక సాయం గురించి ఆరా తీశారు. మొదటి విడత నగదు మంజూరు కాని వారికి త్వరలోనే మంజూరయ్యోలా చూస్తామని హామీ ఇచ్చారు.

విద్యుత్ సమస్య తీర్చాలని వినతి

మాగనూర్: మండల పరిధిలోని వర్కూర్ గ్రామంలో నెలకొన్న విద్యుత్ సమస్యను పరిష్కరించాలని గ్రామస్తులు ఏఈ గంగాధర్‌రావుకు వినతిపత్రం అందజేశారు. గ్రామంలోని ఆరవ వార్డులో ఆరు నెలలుగా అక్కడ ఉన్న విద్యుత్‌బుడ్డీతో నిత్యం సమస్య ఏర్పడుతుందని, ఈ విషయంపై సంబంధిత అధికారులకు ఎన్ని సార్లు విన్నవించినా నిమ్మకు నీరెత్తిన్నట్లుగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. ప్రతి రోజు పగలు, రాత్రి అనే తేడా లేకుండా కరెంట్ పోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా స్పందించి సమస్యను పరిష్కరించాలని కోరారు.

పశువులకు గాలికుంటు నివారణ టీకాలు



మద్దూరు: ఉమ్మడి మద్దూరు మండలంలోని పెదిరిపాడ్, రెనివట్ల, పల్లెర్ల, గోకుల్‌నగర్, చెన్వార్ గ్రామాల్లో పశువులకు వైద్య సిబ్బంది గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేశారు. 191 ఆవులు, 90 గేదేలకు రోగాలు వ్యాపించకుండా టీకాలు వేసినట్లు పశువైద్యాధికారిణులు సబిత, విశాల తెలిపారు. కార్యక్రమంలో సిబ్బంది దేవేందర్, యుద్ధం నాయక్, గోపాల మిత్రలు పాల్గొన్నారు.

ఫింగర్ ప్రింట్ డివైస్‌తో తనిఖీలు

నారాయణపేట: జిల్లా కేంద్రంలో ముందస్తు నేరాల నియంత్రణలో భాగంగా తనిఖీలు చేపట్టినట్లు ఎస్‌ఐ వెంకటేశ్వర్లు తెలిపారు. ఈ సందర్భంగా శుక్రవారం ఆర్టీసీ బస్టాండ్, ప్రధాన చౌరస్తాలలో అనుమానితుల ఫింగర్ ప్రింట్స్ తీసుకున్నారు. అనుమానాస్పదంగా సంచరిస్తున్న వ్యక్తులను తగిన రీతిలో పరిశీలించి, ఆధునిక సాంకేతికతను వినియోగిస్తూ ఫింగర్ ప్రింట్ డివైస్‌తో వ్యక్తుల వేలిముద్రలు సేకరించి క్రిమినల్ రికార్డులతో సరి పోల్చనున్నట్లు తెలిపారు. తనిఖీల్లో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.